భారత్ 3-0

మూడో వన్డేలోనూ ఘనవిజయం • దీప్తి శర్మకు ఆరు వికెట్లు

వడోదర: సొంతగడ్డపై వెస్టిండీస్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం వడోదరలో జరిగిన మూడో వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సీనియర్ స్పిన్నర్ దీప్తి శర్మ (6/31, 39 నాటౌట్) ఆల్‌రౌండ్ షో తో పర్యాటక విండీస్‌కు వైట్‌వాష్ తప్పలేదు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్.. 38.5 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. హెన్రీ (61), క్యాంప్‌బెల్లె (46) మినహా మిగిలిన బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరు చేయడానికే తంటాలు పడ్డారు. ఆరంభంలో రేణుకా సింగ్ ఠాకూర్ (4/29) పదునైన పేస్‌తో చతికిలపడ్డ విండీస్‌ను ఆ తర్వాత దీప్తి కోలుకోనీయకుండా చేసింది. అనంతరం ఛేదనను భారత్ 28.2 ఓవర్లలో పూర్తిచేసింది. దీప్తితో పాటు సారథి హర్మన్‌ప్రీత్ (32), రోడ్రిగ్స్ (29), రిచా (23 నాటౌట్) రాణించారు. దీప్తికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', రేణుకాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.

టాప్‌లో గోవర్ధన్, శ్రవణ్

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి సెయిలింగ్ పోటీలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ సెయిలింగ్ చాంపియన్‌షిప్ పోటీలు హుసేన్‌సాగర్ వేదికగా హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం జరిగిన పోటీల్లో టాప్‌సీడ్ సెయిలర్లు గోవర్ధన్, శ్రవణ్ సత్తాచాటారు. సబ్‌జూనియర్ ఆప్టిమిస్టిక్ క్లాస్ ఆఫ్ బోట్లలో, జూనియర్ సెయిలర్లు ఆప్టిమిస్టిక్ క్లాస్‌ఆఫ్ బోట్లలో పోటీపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్..సబ్‌జూనియర్ ఓవరాల్ ఆప్టిమిస్టిక్ కేటగిరీలో స్థిరమైన ప్రదర్శనతో ఆధిక్యం కనబరిచాడు. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చి పసిడి పతకానికి చేరువయ్యాడు. ఇదే రేసులో దీక్షిత రెండు రేసుల్లో నిరాశపరిచి రెండో స్థానంలో కొనసాగుతున్నది. దీక్షిత సోదరి లాహిరి..సబ్‌జూనియర్ ఓవరాల్ ఆప్టిమిస్టిక్‌లో మూడో స్థానానికి పడిపోయింది. మరోవైపు జూనియర్ లేజర్ ఫ్లీట్‌లో నల్గొండకు చెందిన శ్రవణ్ కత్రావత్ ఒక రేసు మినహా అన్నింటిలో గెలిచి టాప్‌లో నిలిచాడు. బాలికల జూనియర్ లేజర్ ఫ్లీట్‌లో మాన్య అగ్రస్థానం దక్కించుకుంది.

లక్ష్యసేన్ జోరు

షెంజెన్ (చైనా): భారత యువ షట్లర్ లక్ష్య సేన్ ఆరంభ కింగ్ కప్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో సెమీస్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్.. 10-21, 21-13, 21-13తో అంగుస్ ఎన్‌జీ కా లంగ్ (చైనా)ను ఓడించాడు.

సెమీస్ బెర్తులు ఖరారు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సంతోష్ ట్రోఫీలో సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. క్వార్టర్ ఫైనల్‌లో కేరళ.. 1-0తో జమ్మూ కాశ్మీర్‌ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో సర్వీసెస్..2-1తో మేఘాలయాపై గెలిచింది. సెమీస్‌లో బెంగాల్.. సర్వీసెస్‌తో, కేరళ, మణిపూర్‌తో తలపడనున్నాయి.

ఎదురీత

- నిలబడి తడబడ్డ భారత్
- తొలి ఇన్నింగ్స్‌లో 164/5
- స్మిత్ భారీ శతకం
- ఆసీస్ 474 ఆలౌట్

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో రెండో రోజూ ఆతిథ్య జట్టుదే పైచేయి. స్టీవ్ స్మిత్ (197 బంతుల్లో 140, 13 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ శతకానికి తోడు కెప్టెన్ పాట్ కమిన్స్ (49) మెరుపులతో తొలి ఇన్నింగ్స్‌లో కంగారూలు 474 పరుగుల భారీ స్కోరు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (118 బంతుల్లో 82, 11 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లీ (86 బంతుల్లో 36, 4 ఫోర్లు) రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యంతో కుదురుకున్నట్టే కనిపించినా చివర్లో అనవసర తప్పిదాలతో వికెట్లు చేజార్చుకోవడంతో భారత్ మళ్లీ కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇంకా 310 పరుగులు వెనుకబడి ఉంది. రిషభ్ పంత్ (6 నాటౌట్), రవీంద్ర జడేజా (4 నాటౌట్) క్రీజులో ఉండగా నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ మాత్రమే బ్యాటింగ్ చేయగల సమర్థులు. ఈ నేపథ్యంలో రోహిత్ సేన ఏ మేరకు ఆసీస్ ఆధిక్యాన్ని తగ్గిస్తుందనేది ఆసక్తికరం.

నిలబడ్డా.. తడబడ్డారు!

రెండో రోజు లంచ్ తర్వాత కొద్దిసేపటికే ఆసీస్‌ను ఆలౌట్ చేసిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చీ రాగానే షాక్ తగిలింది. గత రెండు మ్యాచ్‌లలో మిడిలార్డర్‌లో వచ్చి విఫలమైన సారథి రోహిత్ శర్మ (3).. మెల్‌బోర్న్‌లో ఓపెనింగ్ చేసినా అతడి బ్యాటింగ్‌లో మార్పు రాలేదు. కమిన్స్ వేసిన రెండో ఓవర్లో ఆఖరి బంతిని పుల్‌షాట్ ఆడబోయిన హిట్‌మ్యాన్ మిడాన్ వద్ద బొలాండ్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ వన్‌డౌన్‌లో వచ్చిన కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 24, 3 ఫోర్లు).. జైస్వాల్‌తో కలిసి ఆసీస్ బౌలర్లను అడ్డుకున్నాడు. క్రీజులో కుదురుకుంటున్న రాహుల్.. సరిగ్గా టీ విరామానికి ముందు కమిన్స్ వేసిన 15వ ఓవర్లో ఆఖరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కోహ్లీకి జతకలిసిన జైస్వాల్.. ఆసీస్ పేస్ త్రయాన్ని సమర్థవంతంగా ఎదుర్కున్నాడు. కోహ్లీ కూడా ఆరంభంలో ఆఫ్‌స్టంప్ ఆవల పడ్డ బంతులను వెంటాడటం మానుకుని డిఫెన్స్‌కు ప్రాధాన్యమిచ్చాడు. ఆసీస్ బౌలర్లు పదే పదే అటువైపుగా బంతులేసినా ఏకాగ్రత కోల్పోలేదు. స్టార్క్ వేసిన 29వ ఓవర్లో 4, 3తో 81 బంతుల్లో జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. క్రమంగా క్రీజులో పాతుకుపోయిన కోహ్లీ కూడా స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యం (102) పూర్తిచేసుకుని సాఫీగా సాగుతున్న ఈ జోడీ సమన్వయ లోపంతో వికెట్లను కోల్పోయింది. చివరి సెషన్‌లో మరో అరగంట అయితే ఆట ముగుస్తుందనగా బొలాండ్ 41వ ఓవర్లో చివరి బంతికి జైస్వాల్ రనౌట్ అయ్యాడు. అతడే వేసిన మరుసటి ఓవర్లో కోహ్లీ.. మళ్లీ ఆఫ్‌స్టంప్ ఆవల బంతిని ఆడబోయి కీపర్ కేరీకి క్యాచ్ ఇచ్చాడు. ఆకాశ్ దీప్ డకౌట్ అయ్యాడు.

స్మిత్ సూపర్ సెంచరీ

అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 311/6తో రెండో రోజు ఆట ఆరంభించిన ఆస్ట్రేలియా.. తొలి రోజు దూకుడునే కొనసాగించింది. 68 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఆడిన స్మిత్.. కమిన్స్ అండగా రెచ్చిపోయాడు. బుమ్రా బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో 90లలోకి వచ్చిన అతడు.. నితీశ్ రెడ్డి ఓవర్లో ఫోర్ కొట్టి తన టెస్టు కెరీర్‌లో 34వ శతకాన్ని పూర్తిచేశాడు. మెల్‌బోర్న్‌లో అతడికి ఇది ఐదో టెస్టు శతకం. సెంచరీ తర్వాత స్మిత్.. టీ20 మోడ్‌లోకి మారాడు. అర్ధ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో కమిన్స్ నిష్క్రమించినా స్మిత్ జోరు తగ్గలేదు. తొలి సెషన్‌లో ఆసీస్ 27 ఓవర్లలోనే 5.29 సగటుతో 143 పరుగులు రాబట్టింది. అయితే లంచ్ తర్వాత మొదటి ఓవర్లోనే జడేజా.. మిచెల్ స్టార్క్ (15)ను ఔట్ చేశాడు. ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయిన స్మిత్.. దురదృష్టవశాత్తూ బౌల్డ్ అయ్యాడు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 474 ఆలౌట్ (స్మిత్ 140, లబూషేన్ 72, బుమ్రా 4/99, జడేజా 3/78); **భారత్:** 46 ఓవర్లలో 164/5 (జైస్వాల్ 82, కోహ్లీ 36, బొలాండ్ 2/24, కమిన్స్ 2/57)

జింబాబ్వే రికార్డు స్కోరు

బులవాయో: టెస్టులలో జింబాబ్వే రికార్డు స్కోరు సాధించింది. అఫ్గానిస్థాన్‌తో బులవాయోలో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 586 పరుగులు చేసింది. టెస్టులలో జింబాబ్వేకు ఇదే అత్యుత్తమ స్కోరు (అంతకుముందు వెస్టిండీస్‌తో 563/9). జింబాబ్వే బ్యాటర్లలో సీన్ విలియమ్స్ (154), బ్రియాన్ బెన్నెట్ (110), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (104) శతకాలతో మెరవగా బెన్ కరన్ (68) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గాన్.. 30 ఓవర్లలో 95/2 పరుగులు చేసింది.

దక్షిణాఫ్రికాకు స్వల్ప ఆధిక్యం

సెంచూరియన్: పాకిస్థాన్‌తో ఇక్కడ జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు స్వల్ప ఆధిక్యం సాధించింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 211 పరుగులకు కుప్పకూలగా సౌతాఫ్రికా 301 పరుగులకు ఆలౌట్ అవడంతో మొదటి ఇన్నింగ్స్‌లో సఫారీలు 90 పరుగుల ఆధిక్యం దక్కించుకున్నారు. సౌతాఫ్రికా తరఫున మార్క్‌రమ్ (89), బోష్ (81) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పాక్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 88/3 పరుగులు చేసింది. బాబర్ ఆజమ్ (16 నాటౌట్), సౌద్ షకీల్ (8 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

హర్యానాతో పాట్నా అమీతుమీ

- **ప్రో కబడ్డీ లీగ్**

పూణె: ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో హర్యానా స్టీలర్స్, పాట్నా పైరేట్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. శుక్రవారం పూణెలోని శ్రీ శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరిగిన సెమీఫైనల్స్ మ్యాచ్‌లలో హర్యానా, పాట్నా తమ ప్రత్యర్థులను మట్టికరిపించి ఫైనల్‌కు చేరాయి. ఈ టోర్నీ ఆసాంతం రాణిస్తూ టేబుల్ టాపర్‌గా ఉన్న హర్యానా.. తొలి సెమీస్‌లో 28-25తో యూపీ యోధాస్‌ను ఓడించింది. హర్యానా నుంచి శివమ్ (7 పాయింట్లు), వినయ్ (6), రాహుల్ (5) రాణించారు. యూపీ యోధాస్ రైడర్ గగన్ గౌడ 10 పాయింట్లతో పోరాడినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఇక రెండో సెమీస్‌లో పాట్నా 32-28తో దబాంగ్ ఢిల్లీని చిత్తు చేసింది ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో గెలుపు కోసం ఇరు జట్లూ చెమటోడ్చాయి. పాట్నా రైడర్ దేవాంక్ (8), అయాన్ (8) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఢిల్లీ కెప్టెన్ అషు మాలిక్ (9) పోరాటం వృథా అయింది. హర్యానా, పాట్నా మధ్య ఆదివారం ఫైనల్ పోరు జరుగనుంది.

డెడికేషన్‌కి ఫిదా అవ్వాల్సిందే

బాలకృష్ణ 'డాకు మహారాజ్' సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ సినిమాలోని బాలయ్య పెర్‌ఫార్మెన్స్ గురించి దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ) ఆసక్తికరంగా మాట్లాడారు. 'నాకెరీర్‌లో ఇప్పటివరకూ అలాంటి నటుడ్ని చూడలేదు. 'డూప్' అనే పేరెత్తితే ఆయనకు పూనకం వస్తుంది. 60ప్లస్ ఏజ్‌లో కూడా డూప్ లేకుండా నటించడానికే బాలయ్య ఇష్టపడతారు. ఆయన డెడికేషన్‌కి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే.' అన్నారు. ఇంకా చెబుతూ 'ఇందులో కథానుగుణంగా కొన్ని ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఆ సన్నివేశాల్లో బాలయ్య నటన అద్భుతం. నిజంగా ఇలాంటి యాక్టర్ చాలా అరుదుగా ఉంటారు. దర్శకుడిగా నాకు పూర్తి సంతృప్తినిచ్చిన సినిమా 'డాకు మహారాజ్'' అని తెలిపారు డైరెక్టర్ కేఎస్ రవీంద్ర. బాలయ్య బ్లాక్‌బస్టర్స్ సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, అఖండ సినిమాలను మించి ఈ సినిమా ఉంటుందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవల మీడియా ముఖంగా చెప్పిన విషయం తెలిసిందే. మొత్తంగా దర్శక, నిర్మాతలు ఈ సినిమాపై వ్యక్తపరుస్తున్న అభిప్రాయాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

రియల్‌లైఫ్ స్టోరీతో

కుబేర, ఇండ్లీ కడై సినిమాలతో బిజీగా ఉన్నారు ధనుష్. మరోవైపు ఆయన కథానాయకుడిగా ఇళయరాజా బయోపిక్ కూడా తెరకెక్కనుంది. ఆ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇదిలావుంటే.. అనుకోకుండా ధనుష్ డైరీలో ఓ కొత్త సినిమా వచ్చి చేరింది. ఇది కూడా బయోపిక్కేనని తెలుస్తున్నది. 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడని చెన్నై సమాచారం. నిజానికి రాజ్‌కుమార్ ఓ బాలీవుడ్ సినిమాను ఇటీవలే ప్రకటించాడు. అయితే.. ఆ సినిమాకంటే ముందే ధనుష్‌తో సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ఈ సినిమా కథ విషయంలో రకరకాల కథనాలు సోషల్‌మీడియాలో వెలువడుతున్నాయి. మనదేశంలో చాలామంది రియల్‌లైఫ్ హీరోలున్నారని, వారి కథలతో సినిమాలు తీస్తే అద్భుతాలు సృష్టించొచ్చని గతంలో రాజ్‌కుమార్ పెరియస్వామి ఓ ఇంటర్వ్యూలో అన్నారు. దానికి తగ్గట్టే ధనుష్‌తో ఆయన చేయబోతున్న సినిమా కూడా రియల్‌లైఫ్ స్టోరీనే అని తెలుస్తున్నది. ఇందులో శ్రుతిహాసన్ కథానాయికగా ఎంపికైందట. మిగతా వివరాలు తెలియాల్సివుంది.

కలల వెంట పరుగు

ప్రశాంత్‌కృష్ణ, అనీషాధామ, శ్రీనివాస్ రామిరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డ్రీమ్ క్యాచర్'. సందీప్ కాకుల దర్శకుడు. జనవరి 3న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. 'ఇన్‌సెప్షన్' లాంటి హాలీవుడ్ సినిమాలు తనకెంతో స్ఫూర్తినిచ్చాయని, కలల నేపథ్యంలో ఈ సినిమా తీశానని, ఎలాంటి పాటలు, ఫైట్స్ లేకుండా గంటన్నర నిడివితో సాగుతుందని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందని హీరో ప్రశాంత్‌కృష్ణ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రణీత్ గౌతమ్ నందా, సంగీతం: రోహన్‌శెట్టి, సంభాషణలు: గుహన్ జాస్తి, నిర్మాణ సంస్థ: సీయోల్ మోహన్ పిక్చర్స్, రచన-దర్శకత్వం: సందీప్ కాకుల.

చిత్రం

ఎవరో ఒకరు రాజీ పడాల్సిందే!

ప్రేమలో రెండు సార్లు విఫలమైన కారణంగా మనశ్శాంతిని కోల్పోయినట్లుంది చెన్నై చందమామ శ్రుతిహాసన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, రిలేషన్, పెళ్లి అంశాలపై ఆమె ప్రస్థావించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'ప్రేమలో ఉన్నప్పుడు బాగానే ఉంటుంది. అభిప్రాయబేధాల వల్ల అంతరాలు పెరుగుతున్నప్పుడు ఓ బాధ. విడిపోయిన తర్వాత ఓ బాధ. ఇది అనుభవించిన వారికే తెలుస్తుంది. పెళ్లి అనే కట్టుబాటు బంధాలను శాశ్వతం చేస్తుందంటే కూడా నేను నమ్మను. ఎవర్నీ బలవంతంగా కలిపి ఉంచలేం. మా అమ్మానాన్న ప్రేమించే పెళ్లి చేసుకున్నారు. చాలా అందమైన జంట. ఈ ప్రపంచంలో ఉత్తమ జంట మా అమ్మానాన్నే అనుకునేదాన్ని. ఇద్దరూ చాలాకాలం కలిసున్నారు. ఆ టైమ్‌లో మా ఇల్లు చాలా బావుండేది. ఉన్నట్టుండి విడిపోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా కలిసి ఉండటానికి ప్రయత్నించారు. కానీ కుదర్లేదు. పరిస్థితులకు ఎదురొడ్డి గెలవలేం. ఎవరో ఒకరు రాజీ పడితే తప్ప బంధాలు నిలవవ్. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవ్. అందుకే పెళ్లిపై నాకు సదాభిప్రాయం లేదు' అని తేల్చేసింది శ్రుతిహాసన్.

ఊహించిన దానికంటే స్పందన బాగుంది

వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల, రవి తేజ మహాదాస్యం ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. ఈ నెల 25న సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. అనన్య నాగళ్ల మాట్లాడుతూ 'ఇప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ ఒకెత్తు. ఈ సినిమా ఒకెత్తు. కొత్త ప్రయత్నం చేస్తే తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని ఈ సినిమాతో రుజువైంది. చూసిన ఆడియన్స్ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అంటున్నారు.' అని అన్నారు. ఇందులో వినోదమే కాకుండా థ్రిల్లింగ్ ఫ్యాక్టర్ కూడా ఉందని, అందుకే ఆడియన్స్‌కి నచ్చిందని సినిమాను విడుదల చేసిన వంశీ నందిపాటి తెలిపారు. ఊహించిన దానికంటే మంచి స్పందన వస్తున్నదని నిర్మాత వెన్నపూస రమణారెడ్డి పేర్కొన్నారు.

రెండు భాగాలుగా పోలీస్ కథ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. 'వీడీ 12' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. 'విధి పిలిచింది. రక్తపాతం ఎదురుచూస్తోంది' అనే క్యాప్షన్‌తో గతంతో విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ అందరిలో ఆసక్తిని పెంచింది. ఈ సినిమాకు సంబంధించిన న్యూ అప్‌డేట్‌ను నిర్మాత సూర్యదేవర నాగవంశీ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయబోతున్నామని తెలిపారు. 'స్క్రిప్ట్ దశలోనే ఈ సినిమాను రెండు భాగాలుగా తీయాలనుకున్నాం. ప్రొడక్షన్ మధ్యలో తీసుకున్న నిర్ణయం కాదిది. అయితే రెండు భాగాల్లో కథ పూర్తి విభిన్నంగా ఉంటుంది. ఇప్పటికే 80 శాతం చిత్రీకరణ పూర్తయింది' అని ఆయన తెలిపారు. ఈ సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు విజయ్ దేవరకొండ. ఈ రెండు చిత్రాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో విజయ్ అభిమానులు ఆనందంగా ఉన్నారు.

ఏడారిలో అన్వేషణ

తమిళ అగ్ర నటుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి'. మగిల్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ఈ సినిమా నుంచి 'సవదీక..' అనే ఫాస్ట్‌బీట్ పాటను విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ స్వరాల్ని అందించారు. భయంకరమైన ఏడారిలో తప్పిపోయిన తన భార్య కోసం కథానాయకుడు చేసే అన్వేషణ, ఈ క్రమంలో గ్యాంగ్‌స్టర్స్ నుంచి అతనికి ఎదురయ్యే ప్రతి ఘటన నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అజిత్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని, పోరాట ఘట్టాలు రోమాంచితంగా సాగుతాయని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో త్రిష, అర్జున్, రెజీనా, నిఖిల్ నాయర్ తదితరులు ప్రధాన పాత్రల్ని పోషించారు. తమిళ, తెలుగు భాషల్లో భారీ స్థాయిలో విడుదల కానుంది.

మార్కో దుష్టశిక్షణ

మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ లీడ్‌రోల్ పోషించిన మలయాళ చిత్రం 'మార్కో'. హనీఫ్ అదేని దర్శకత్వంలో షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన ఈ చిత్రాన్ని అదే పేరుతో ఎన్వీఆర్ సినిమా తెలుగులో జనవరి 1న విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రక్తపు మరకలతో సీరియస్‌గా చూస్తున్న ఉన్ని ముకుందన్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కేరళలో అఖండ విజయాన్ని సాధించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని మేకర్స్ చెబుతున్నారు. యుక్తి తరేజా, కబీర్ దుహన్‌సింగ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: చంద్రు సెల్వరాజ్, సంగీతం: రవి బస్రూర్, నిర్మాణం: క్యూబ్స్ ఎంటర్టైన్మెంట్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.